క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి



నర్సయ్య (ఫైల్)

తొర్రూరు: రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి చెందిన ఘటన డివిజన్ కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి రేగూరి నర్సయ్య (72) శుక్రవారం సాయంత్రం స్కూటీపై ఇంటి నుంచి రోడ్డుపైకి రాగా నెల్లికుదురు వైపు బైక్‌పై వేగంగా వెళ్తున్న మైనర్ స్కూటీని ఢీకొట్టాడు. దీంతో నర్సయ్య తలకు, ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లగా పరిస్థితి విషమించి శనివారం మృతిచెందాడు. ఈ మృతికి నెల్లికుదురు మండలం నైనాల గ్రామానికి చెందిన మైనర్ నారబోయిన వేణు కారకుడని పోలీసులు గుర్తించారు. బాలుడితోపాటు అతనికి బైక్ ఇచ్చిన తండ్రి నారబోయిన వెంకన్నలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

మహబూబాబాద్ అర్బన్: క్రీడలు స్నేహపూర్వకంగా ఆడుకోవాలని డీఎస్పీ తిరుపతిరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల ఫొటో, వీడియోగ్రాఫర్ల క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్, లక్ష్మణ్, సుభాష్, బాబురావు పాల్గొన్నారు.

శైలజకు డాక్టరేట్



గార్ల: గార్లకు చెందిన దాసరి శైలజకు జేఎన్‌టీయూహెచ్ హైదరాబాద్‌లో శనివారం డాక్టరేట్ పట్టా అందుకుంది. శైలజ 'ఆప్టిమైజ్డ్ ట్రస్ట్ బేస్డ్ ఫ్రీక్వెన్సీ అలకేషన్ ప్రొటోకాల్ ఫర్ పాత్ ఆప్టిమైజేషన్ ఇన్ వేకప్ రేడియో'అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రస్తుతం శైలజ కాకతీయ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి

మహబూబాబాద్ రూరల్: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే విధంగా పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ భవనంలో భరత్ చందర్ రెడ్డిని పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు గుగులోతు వెంకట్ నాయక్, గుట్టయ్య, పోతురాజు రాజు, రామచంద్రు, వీరభద్రం, శ్రీధర్, శంకర్ నాయక్, సీతారాములు పాల్గొన్నారు.

తొర్రూరు సీఐగా గణేశ్



తొర్రూరు: తొర్రూరు నూతన సీఐగా టి.గణేష్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ మల్టీజోన్-1 ఐజీ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఇప్పటివరకు ఆత్మకూరు సీఐగా పని చేయగా అనంతరం డిప్యూటేషన్‌పై ట్రాన్స్‌కోలో విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు తొర్రూరు సీఐగా పని చేసిన జగదీష్ ఓ కేసులో ఏసీబీకి పట్టుబడగా అతనిపై సస్పెన్షన్ వేటుపడింది.

నాణ్యమైన భోజనం అందించాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ భగవాన్ రెడ్డి అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని శనిగపురం ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజనంను తహసీల్దార్ శనివారం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బానోత్ హరిసింగ్ నాయక్ పాల్గొన్నారు.

బొలెరో టైర్లు చోరీ

మహబూబాబాద్ రూరల్: కోళ్లను క్రయవిక్రయాలు చేసే బొలెరో వాహనానికి ఉన్న టైర్లు, డిస్కులను దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన జిల్లా కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. జిల్లా కేంద్రంలోని కొత్త కూరగాయల మార్కెట్ భవన సముదాయం సమీపంలో గల చికెన్ షాప్ నిర్వాహకుడు కొడారి శ్రీనివాస్ తన బొలేరో వాహనాన్ని స్థానిక ఓసీ క్లబ్ ఆవరణలో పార్కింగ్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి వాహనం టైరు, డిస్కులు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు. వాటి విలువ రూ.50వేల వరకు ఉంటుందని బాధితుడు టౌన్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశాడు.

రైల్వే ఉద్యోగుల క్రికెట్ పోటీలు

దోర్నకల్: స్థానిక బిషప్ గ్రౌండ్‌లో శనివారం రైల్వే ఉద్యోగుల క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. రైల్వే ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే పోటీల్లో తొమ్మిది టీంల మధ్య పోటీ పడుతున్నాయి.

'గ్యారంటీ' లేని 'ప్రజాపాలన'

- మండలంలో 600 దరఖాస్తులకు మోక్షం కరువు
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలపై ఆర్థికభారం
- పథకాలు వర్తించడంలేదని ఆవేదన



కంబాలపల్లి గ్రామంలో కదారి ఉమ ఇచ్చిన ప్రజాపాలన దరఖాస్తు, వారికి వస్తున్న కరెంటు బిల్లు

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో భాగంగా ప్రజల వద్ద నుంచి స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను కంప్యూటర్లలో నమోదు చేయకపోవడం కారణంగా లబ్ధిదారులు ఆర్థికంగా నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో మండలంలోని 41గ్రామాల పరిధిలో గల లబ్ధిదారులు పడుతున్న కష్టాలు చెప్పలేని విధంగా ఉన్నాయి. అధికారిక లెక్కల ప్రకారం మండలం మొత్తంగా 600 దరఖాస్తులకు మోక్షం కరువైంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలపై ఆర్థికభారం పడుతుండగా ప్రభుత్వం పేదల కష్టాలను ఎప్పుడు తీరుస్తుందని ప్రశ్నిస్తున్నారు. ప్రజల వద్ద నుంచి స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తులకు సంబంధించిన వారి వివరాలను కంప్యూటర్లలో నమోదు చేయలేదని వివిధ గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలలో ఏ ఒక్కటి కూడా తమకు వర్తించడంలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ రఘుపతిరెడ్డిని సంప్రదించగా వెబ్‌సైట్ క్లోజ్ అయిందని, మళ్లీ ఓపెన్ అయితే కంప్యూటర్లలో నమోదు చేస్తామని చెబుతున్నారన్నారు. అధికారులు సంవత్సర కాలంగా ఇదే సమాధానం చెబుతూ దాటవేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు తమకు అందకుండా పోతున్నాయని, ప్రభుత్వం స్పందించి తమకు ఆరు గ్యారంటీలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లిస్టులో పేరు రాలేదు



మా ఊరి గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు ఇస్తే మాయమైందని అధికారులు అంటున్నారు. ఇటీవల ఇందిరమ్మ ఇంటి కోసం కూడా దరఖాస్తు ఇస్తే లిస్టులో పేరు రాలేదని అధికారులు చెప్పారు. అలాంటప్పుడు దరఖాస్తులు ఎందుకు తీసుకున్నారు.

- భూక్యా భద్రు, బిచ్యతండా

ఏడాది కాలంగా పెండింగ్



ప్రజాపాలనలో దరఖాస్తు ఇచ్చినప్పటికీ మాకు ఏ పథకం వర్తించడం లేదు. ఎంపీడీఓ కార్యాలయంలో అడిగితే ఆన్‌లైన్ కాలేదని చెబుతున్నారు. పేదోళ్ల కోసం పెట్టిన గృహలక్ష్మి, రూ.500కు గ్యాస్ అన్ని ఏడాది కాలంగా పెండింగ్ పెట్టి మమ్ముల్ని ఆర్థికంగా నష్టపరుస్తున్నారు.

- వీరన్న, జీపీ సిబ్బంది, కంబాలపల్లి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

దోర్నకల్: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం ఎమ్మెల్యే మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం 35 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారులు, కార్యదర్శులు అందరిని సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ పథకాలకు అర్హులను ఎంపిక చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసనాయక్, తహసీల్దార్ కృష్ణవేణి, మున్సిపల్ వైస్ చైర్మన్ కోటిలింగం, జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల శ్రీనివాస్‌యాదవ్, పట్టణ అధ్యక్షులు కాలా సుమేర్‌చంద్‌జైన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

స్థానిక జెడ్పీహెచ్ఎస్ క్రీడా ప్రాంగణంలో శనివారం కాంగ్రెస్ నాయకులు శీలం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కప్ పేరుతో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి, కొద్దిసేపు వాలీబాల్ ఆడి ఆకట్టుకున్నారు.

బీసీలకు కాంగ్రెస్ పెద్దపీట



దోర్నకల్: మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

మరిపెడ: బీసీలకు కాంగ్రెస్ పార్టీ పెద్ద పీట వేస్తుందని ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. ఈ మేరకు మరిపెడ ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శనివారం బీసీ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, గుండగాని వెంకన్న, రాకేష్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

మరిపెడ ఆడిటోరియంలో శనివారం కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘువీరారెడ్డి, నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, తాజుద్దీన్, శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సోమయ్య



ధర్నా చేస్తున్న నాయకులు

మహబూబాబాద్: ప్రజాపాలనలో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా చేసి కమిషనర్ నోముల రవీందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా సూర్నపు సోమయ్య మాట్లాడుతూ.. అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాజమౌళి, సీతారాంనాయక్, రావుల రాజు, నాగన్న, సైదులు, వెంకన్న, శ్రీనివాస్, మహేందర్, ప్రకాష్, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ప్రజలు సహకరించాలి

మహబూబాబాద్ రూరల్: రాబోయే ఎన్నికల్లో శాంతియుత వాతావరణం ఏర్పడేందుకు ప్రజలు సహకరించాలని ఎస్సై దీపిక కోరారు. మండలంలోని సంద్రాలగూడెం గ్రామంలో శనివారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లికుదురు: స్థానిక మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.ఉపేందర్‌రావు శనివారం తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7, 8, 9, 10 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థులు ఫిబ్రవరి 28వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, పీహెచ్‌సీ విద్యార్థులు రూ,125, జనరల్ విద్యార్థులు రూ.200 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏప్రిల్ 13న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసు నమోదు చేయాలి



ఫిర్యాదు అందజేస్తున్న అనిల్ కుమార్, తదితరులు

మహబూబాబాద్ రూరల్: మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని కోరుతూ మహబూబాబాద్ టౌన్ ఎస్సై బి.విజయ్‌కుమార్‌కు శనివారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనిల్ కుమార్‌మాదిగ, కుల సంఘ నాయకులు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగపై మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, కొట్టి చంపుతామని బెదిరింపులకు పాల్పడుతూ ప్రకటనలు చేశాడన్నారు. రామ్మూర్తిపై తక్షణమే అత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోలెపాక ప్రవీణ్, ఎమ్మెస్పీ జిల్లా నాయకులు భిక్షపతి, సోమన్న, అంజిబాబు, ఈదురు సైదులు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎల్లయ్య

నెహ్రూసెంటర్: ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా పోరాటాలకు సిద్ధమయ్యేందుకు ఈనెల 25న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కోండ్ర ఎల్లయ్యమాదిగ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిషన్ రిపోర్టు ఆధారంగా వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేసి ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, బీఆర్ అంబేడ్కర్ సహాయ నిధి రూ.12లక్షలు అందించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను వారి అభివృద్ధికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పులి శ్రీను, రాధా, సుధా, బాలరాజు, సాంబయ్య, సందీప్, స్రవంతి, జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

'పట్టా భూమిలో ఆస్పత్రి నిర్మాణం'



తహసీల్దార్‌తో వాగ్వాదం చేస్తున్న నాయకులు

కురవి: పట్టా భూమిలో ఆస్పత్రి నిర్మాణం చేపట్టే విధంగా పనిచేసి పేద కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్న సీరోలు తహసీల్దార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్, బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు తగరం నాగన్నల ఆధ్వర్యంలో శనివారం సీరోలు గ్రామంలో నిరసన వ్యక్తం చేసి ధర్నా చేశారు. ఆస్పత్రి నిర్మాణ పనులకు భూమి పూజ చేసే స్థలం వద్ద తహసీల్దార్ శారదతో వాగ్వాదానికి దిగారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సీరోలుకు చెందిన పత్తి అంతయ్య సర్వే నంబర్ 65, 66లో అదే గ్రామానికి చెందిన కొందరి వద్ద కొనుగోలు చేశారని తెలిపారు. పట్టా భూమిని లాక్కొని ఆస్పత్రి భవన నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి వత్తాసు పలుకుతున్న తహసీల్దార్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మంగీలాల్‌నాయక్, రాందాస్ నాయక్, శ్రీను, సోమోజీనాయక్, కొప్పుల కిరణ్, కిషన్‌నాయక్, వీరన్న, రవి పాల్గొన్నారు.

సాగుచేసే భూములకే రైతు భరోసా

- డీఏఓ విజయనిర్మల



బొప్పాయి తోటను పరిశీలిస్తున్న అధికారులు

దంతాలపల్లి/తొర్రూరు: సాగుయోగ్యంకాని భూములను రైతు భరోసా పథకం జాబితా నుంచి తొలగించాల్సిందేనని జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. దంతాలపల్లి మండలంలోని దాట్ల, తొర్రూరు డివిజన్ కేంద్రంలోని సర్వినగర్‌లో నిర్వహిస్తున్న సర్వే, వ్యవసాయ భూములను శనివారం వారు పరిశీలించిన అనంతరం మాట్లాడారు. నిరుపయోగంగా ఉన్న భూములు, వెంచర్లు, గుట్టలకు కాకుండా వ్యవసాయం చేసే భూముల రైతులకు మాత్రమే రైతు భరోసా పొందే హక్కుందన్నారు. ఆ భూములను లెక్కకట్టి సాగులో లేని భూములను జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం దాట్ల గ్రామంలో సాగు చేస్తున్న బొప్పాయి తోటను పరిశీలించి రైతుకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ కాటం చంద్రరాజేశ్వర్, ఏఓ వాహిని, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, ఏఈఓ దీక్షిత్ కుమార్, ఏఓ భాస్కర్, ఏఈఓలు దీపిక, భరత్‌చంద్ర, మున్సిపాలిటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నెహ్రూసెంటర్: అవగాహన కల్పిస్తున్న అధికారులు

నెహ్రూ సెంటర్: రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందరూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం పొందాలని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి జయపాల్ రెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు శనివారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సాయిచరణ్, వెంకట్ రెడ్డి, ఆర్టీసీ ఏఎంఎఫ్ పాపిరెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు

మహబూబాబాద్ అర్బన్: మైనర్లు వాహనాలు నడిపితే జైలు శిక్ష, రూ.25వేల జరిమానా తప్పదని జిల్లా రవాణా శాఖ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సాయి చరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో శనివారం రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించారు.

'చలో ఢిల్లీ' విజయవంతం చేయాలి

మహబూబాబాద్: వచ్చే నెల 10న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శనివారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం రూ.300 మాత్రమే పింఛన్ ఇస్తుందని, దానిని రూ.500కు పెంచాలని డిమాండ్ చేశారు. అర్హులైన దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో నరేష్, సారయ్య, గౌరమ్మ, సరిత, యాకయ్య, నాగరాజు, వెంకన్న, కళమ్మ, మనమ్మ, పద్మ, వీరభద్రం, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పేదలకు మొండిచేయి చూపిన ప్రభుత్వం

గార్ల: రేషన్‌కార్డుదారుల మంజూరు జాబితాలో అర్హులైన నిరుపేదలకు మొండిచేయి చూపిందని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గుండెబోయిన నాగమణి ప్రభుత్వంపై మండిపడ్డారు. శనివారం మండలంలోని సీతంపేటలో ఆమె ఇంటింటి సర్వే చేపట్టారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

దోర్నకల్: త్వరలో నిర్వహించే పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని సీఐ బి.రాజేష్ కోరారు. మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో శనివారం గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సై గడ్డం ఉమ, కార్యదర్శి వెంకటేశ్వర్లు, రామయ్య పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

నెల్లికుదురు: ఈనెల 19న జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే డీఎస్సీ 2024 ఉపాధ్యాయులకు నిర్వహించే అవగాహన సదస్సును జయప్రదం చేయాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు యాకయ్య, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ నూతన ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ కార్యాలయంలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించారు.

సర్వే ఆపాలంటూ అధికారుల అడ్డగింత

దంతాలపల్లి: ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేను ఆపాలంటూ అధికారులను అడ్డగించిన సంఘటన మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు రెండు వేల మంది దరఖాస్తు రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే కేవలం 116 మందికి మాత్రమే కార్డులు వచ్చాయన్నారు. అనర్హులకు కార్డులు ఇచ్చారని అధికారులను అడ్డగించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

దంతాలపల్లి: మండలంలోని రామానుజపురం గ్రామంలో శనివారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు మల్లం శ్రీను మాట్లాడుతూ.. రూ.5లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు.

భద్రతను పటిష్టం చేసుకోవాలి

బయ్యారం: బ్యాంకులు, ఏటీఎంల వద్ద భద్రతను పటిష్టం చేసుకోవాలని గార్ల-బయ్యారం సీఐ రవికుమార్ బ్యాంకు మేనేజర్లకు సూచించారు. మండలంలోని పలు బ్యాంకుల మేనేజర్లతో శనివారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎస్సై తిరుపతి పాల్గొన్నారు.

విగ్రహం ధ్వంసం

మహబూబాబాద్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గల సరస్వతీదేవి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయగా హెచ్‌ఎం సమ్మెట వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని రూరల్ ఎస్సై వి.దీపిక శనివారం తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

కేసముద్రం: మండల కేంద్రంలోని శివారు గిర్నితండా, ఎన్టీఆర్ నగర్, బ్రహ్మంగారితండా, అమీనాపురం గ్రామాల్లో గూడూరు ఎక్సైజ్ శాఖ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఈమేరకు పలు చోట్ల 200లీటర్ల చెక్కర పానకాన్ని ధ్వంసం చేశారు. 12లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసి, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు గూడూరు ఎక్సైజ్ శాఖ సీఐ భిక్షపతి తెలిపారు. ఎస్సై రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

కంఠమహేశ్వరుడికి బోనాలు



కురవి: మండలంలోని మోద్గులగూడెం గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్యదైవం కంఠమహేశ్వరస్వామి వేడుకల్లో భాగంగా శనివారం మహిళలు స్వామివారికి బోనాలను సమర్పించుకున్నారు.

ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి

నెహ్రూసెంటర్: కళాకారులు తమ కళల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి నక్క సైదులు అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో పీఎన్‌ఎం జిల్లా కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈనెల 25వ తేదీ నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలకు ప్రజానాట్యమండలి కళాకారులు, అభ్యుదయ వాదులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో నాగేంద్ర, పవన్‌కుమార్, ఉప్పలయ్య, జహీర్ ఖాన్ పాల్గొన్నారు.

'కబ్జాకు గురైన శిఖం భూమి'

గార్ల: గార్ల పెద్దచెరువు శిఖం భూమి కబ్జాకు గురైందని, కబ్జాకు గురైన శిఖం భూమిని వెలికి తీయాలని అఖిలపక్షం నాయకులు జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. కబ్జాకు గురైన భూమిని వెలికితీయాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాసరావు, లక్ష్మణ్‌నాయక్, సత్యనారాయణ, కట్టెబోయిన శ్రీనివాసరావు, సక్రు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తుల మృతి

గార్ల: టీవీఎస్ ఎక్సెల్ బండిపై నుంచి పడి తీవ్ర గాయాలైన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందిన సంఘటన సీతంపేట గ్రామంలో చోటుచేసుకుంది. గార్ల పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం సీతంపేట గ్రామ పంచాయతీ కస్నాతండాకు చెందిన జర్పుల భీకోజీ(60) ఈనెల 15న కూరగాయలు కొనుగోలు చేసేందుకు టీవీఎస్ ఎక్సెల్ బండిపై వస్తుండగా, ప్రమాదవశాత్తు బండిపై నుంచి కిందపడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వరంగల్ ఎంజీఎంకి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు జర్పుల రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రవీందర్ తెలిపారు.

దోర్నకల్‌లో ఒకరు..

దోర్నకల్: సీరోలు మండలం మోదుగ్గడ్డతండాకు చెందిన ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ బి.రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మోదుగ్గడ్డతండాకు చెందిన బానోత్ నరేష్(26) ఇటీవల కుటుంబ తగాదాల నేపథ్యంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి బానోత్ దుబ్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తల్లికి తలకొరివి పెట్టిన కూతురు

గార్ల: గార్లలోని రాతిస్తంభం బజారుకు చెందిన సీపా జయలక్ష్మి శతాధిక వృద్ధురాలు మరణించడంతో, ఆమె కూతురు విజయలక్ష్మి తల్లికి శనివారం తలకొరివి పెట్టి కన్నతల్లి రుణం తీర్చుకుంది.

అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ



గూడూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ప్రతీ ఒక్కరు కొనసాగించాలని సీఐ బాబూరావు, ఎస్సై గిరిధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుండెంగ గ్రామంలో శనివారం అంబేడ్కర్ యువజన సంఘం గ్రామశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని సీఐ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. అనంతరం సంఘం ప్రతినిధులు తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కందిక రాము, కందిక సుమన్, సుమలత, బోడ కిషన్, ఐలయ్య, కొమురయ్య పాల్గొన్నారు.